
# అద్దంలో విప్లవం



కవి తన గదిలో కూర్చుని 'విశ్వ మానవ సౌభ్రాతృత్వము' అనే గ్రంథము యొక్క ఆఖరు పేజీలను అత్యుత్సాహంతో రాసేస్తున్నాడు. అతడి గదిఅంతా పుస్తకాలతోనూ కాగితాలతోనూ నిండిపోయి వున్నది. ఒక బీరువా కాళిదాసు, హోమర్, వర్జిల్, పోతన, మిల్టన్ మొదలైన పురాతన కవుల ఉత్కృష్ట గ్రంథములతోనూ, మరొక బీరువా జాన్సన్, గోల్డుస్మిత్, కందుకూరి, బెర్నార్డ్‌షా, టాల్‌స్టాయ్, టాగూర్ మొదలైన తరువాత కవుల పుస్తకాలతోనూ నింపబడివున్నై. మూడో బీరువాలో కవి రాసిన కాకి తుక్కు కథలు, నవలలు, నాటకాలు, గేయాలు, కావ్యాలు, రాజకీయ సాంఘిక గ్రంథాలూ పేర్చబడి వున్నై.

కవి తన గ్రంథరాజపు ఆఖరు పేజీ వ్రాయటం ముగించి, ఒక సిగరెట్టు ముట్టించి పురాతన కవుల పుస్తకాలున్న బీరువావైపు సగర్వంగా పొగ వదిలాడు. పురాతన కవులు తమతమ పుస్తకాలలోంచి బయటకువచ్చి చిరునవ్వుతో తనను ఆశీర్వదించటం పొగవెనక మసగగా కనపడింది కవికి. కవి సంతోషంపట్టలేక తెగ వదిలేస్తున్నాడు సిగరెట్టు పొగని. గదిఅంతా పొగతో నిండిపోయింది. కవి హృదయం సంతోషంతో నిండిపోయింది. కాని ఆధునిక కవులంతా తమతమ గ్రంథాలలోంచి బయటపడి ఏకగ్రీవంగా 'నీ గ్రంథాల్లోని భావాలు బూజు పట్టిన భావాలు, నువ్వు రాసేదంతా చెత్త' అనేటప్పటికి హృదయంలోంచి సంతోషం మాయమై నిరాశ ప్రవేశించింది.

'నేను చెత్త రాస్తున్నానా?' విచారంతో కవి ప్రశ్నించాడు.

'అవును. ముమ్మాటికీ చెత్త రాస్తున్నావు' ఆధునిక కవుల కంఠాలన్నీ ఎలుగెత్తి అన్నై.

కవికి మతి పోయింది. జుట్టు పీక్కుని ఒకసారి పూర్వకవులు అలంకరించిన అద్దాల బీరువావైపు చూశాడు. వాళ్ళంతా చిరునవ్వుతో మళ్ళీ ఆశీర్వదించేటప్పటికి కవికి ధైర్యంవచ్చింది. ఆధునిక కవిసముదాయంవైపు తిరిగి అన్నాడు:

'లేదు. నేను చెత్త రాయటంలేదు-చూడండి పూర్వకవులంతా నన్నెట్లా అభినందిస్తున్నారో?

'వాళ్ళ బుర్రలకు బూజు పట్టింది. వాళ్ళ అభిప్రాయాలూ, భావాలూ యీ ఇరవయ్యో శతాబ్దంలో ఎందుకూ పనికిరాని చెత్తగా పరిగణించబడుతున్నాయి. కాబట్టి వాళ్ళునిన్ను అభినందిస్తున్నారంటే నువ్వుకూడా చెత్తరాస్తున్నావన్నమాటే!" ఏక కంఠంతో చాటారు, ఆధునికకవులు.

కవి చెవులు మూసుకున్నాడు. కళ్లు కూడా మూసుకుని కాసేపు ఆలోచించి ఉపన్యాసధోరణిలో గంభీరంగా అన్నాడు—

'లేదు, నేను రాసింది చెత్త కాదు, నా భావాలు బూజుపట్ట లేదు. నా భావాలను మీరు అర్థం చేసుకోలేక చెత్త అంటున్నారు. నా గ్రంథాలను మీరు అర్థం చేసుకోవాలంటే

కొండేపూడి సూర్యకామరాజు

మీరు మరొక శతాబ్దం బతకాలి. అప్పుడు నా గ్రంథాలనూ, నా భావాలనూ, నా అభిప్రాయాలనూ ప్రపంచం ఎలుగెత్తి పొగుడుతుంది. నా అభిప్రాయాలకు అనుగుణమైన రాజ్యాంగాన్ని ఏర్పరుచుకొని ప్రపంచం సుఖిస్తుంది. అందువల్ల నేను రాసింది చెత్తగాదు. నా గ్రంథాలను పొగిడిన పూర్వకవుల ముద్రలకు బూజు పట్టలేదు. వాళ్ళు రాసింది చెత్తకాదు. వాళ్ళ భావాలు బూజు పట్టినవి కావు. పూర్వకవుల విశాల హృదయాల్లోని భావాలు అన్నికాలాలకూ వర్తిస్తవి. నా అత్యభ్యుదయకరమైన భావాలు మీకిప్పుడు అర్థం చేసుకోటం చేతకాదు. మరొక శతాబ్దం తరువాత ఉండే ప్రపంచ పరిస్థితులతో నా ఉద్దేశాలను పోల్చుకుని పరిమాణుకునే దూరదృష్టి మీకు లేదు.'

కవి తన ఆవేశపూరితమైన వచనాలాన్ని ముగించేటప్పటికి గదిలోని సిగరెట్టు పొగ అంతా కిటికీలలోంచి తలుపు సందుల్లోంచి మాయమైంది. దాంతో కవులంతా వాళ్ళ గ్రంథాలను మాత్రం అక్కడే వదిలి మాయమయ్యారు. కవి తన 'విశ్వమానవ సౌభ్రాతృత్వము' వైపు చూశాడు. వెంటనే అతడి పోయిన సంతోషం తిరిగి వచ్చింది. ఆ వ్రాతప్రతిని అటూ యిటూ తిప్పి సంతృప్తితో తనలో తను అనుకున్నాడు—

'ఈ గ్రంథానికి విలువ కట్టటం వీళ్ళ తరమా?— రాజ్యాంగాల్ని తయారు చేసేవాళ్లు యీ గ్రంథాన్ని అర్థంచేసుకో గలిగితే ప్రపంచం ఎంత సౌఖ్యవంతంగా వుండునో కదా!'

గ్రంథం అచ్చవుతుంది. అనేకమంది చదువుతారు. అర్థమయినవాళ్లు మెచ్చుకుంటారు. అర్థం కానివాళ్ళు అందులో ఏదో విశేషముందబట్టే అర్థం కాలేదని మెచ్చుకుంటారు. మరి కొంతమంది తన పుస్తకాలను మెచ్చుకోటం ఫాషన్ కాబట్టి మెచ్చుకుంటారు. ఎట్లాగూ ప్రజలు మెచ్చుకుంటారు కదా అని పత్రికలు పొగుడుతై. గొప్పగొప్ప పండితుల వద్దనుండి అభినందన పత్రాలు వస్తై— కవి సంతోషం పట్టలేక పోయాడు. తనని తాను చూసుకోవాలని ఎదురుగావున్న నిలువుటద్దంవైపు నడిచాడు. కవి అద్దంలోకి చూడగానే అతడి ముఖం వివర్ణమైంది! కారణం, తన ప్రతిబింబానికి బదులు వీణాపాణిగా సరస్వతి నిలువుటద్దంలో నిలువునా ప్రత్యక్షమైంది!

'దేవీ— ఆజ్ఞ' అని సాక్షాత్కరించిన సరస్వతి మృదుపదాల ముందు మోకరిల్లాడు కవి.

'నువ్వు రాయటం మానెయ్. అదే నా ఆజ్ఞ.' సరస్వతి బి.బి.సి. రేడియోధ్వనితో అన్నది.

కవికి వెంటనే గొడ్డలి పెట్టి తలమీద బాదినట్టయింది. అతడు ముఖం పైకెత్తి సరస్వతి కళ్ళల్లోకి తీక్షణంగా చూసి అన్నాడు—

'దేవీ, పరిహాస మాడుతున్నావ్!'

'నీతోనా?— పరిహాసమా! సారస్వతానికి అధికారిణి అయిన సరస్వతీదేవి చెత్తతో కాగితాలు నింపే నీచకవితో పరిహాస మాడుతుందా!'

'దేవీ, నువ్వేనా మాట్లాడేది?' లేచి నిలబడి వణికిపోతూ కవి అన్నాడు.

'అవును నేనే— అబ్బాయ్, భ్రమ వొద్దులు. నీ గ్రంథాలనుచూసి నేను గర్వంతో విర్రవీగటం లేదు. క్రుంగి కృశించిపోతున్నాను. నువ్వు నానాచెత్తా రాసి నన్ను చిన్న బుచ్చుతున్నావు. లోకం దృష్టిలో నన్ను చాలా చవుకగా చేశావు.'

సరస్వతి మాటలు వినలేక కవి చెవులు మూసుకున్నాడు. గద్గదస్వరంతో అతడన్నాడు—

'దేవీ, నీ కఠోరాక్షరాలతో యీ దీనుణ్ణి చిత్రవధ చెయ్యటం భావ్యంకాదు. నిన్ను చిన్న బుచ్చే— లోకం దృష్టిలో చవుక చేసే— వుద్దేశం నా కెన్నడూ లేదు. నిన్ను రంగురంగుల కాంతులతో ప్రపంచంముందు ప్రకాశింప చెయ్యటమే నా గ్రంథాల పరమావధి. ఉత్త చెత్త గ్రంథాలురాసే నీచకవిగా నన్ను వర్ణించటం దేనికి తగని పని— దేవీ, యీ దీనుడి ముఖం ఒక్కసారి చూడు. ఈ దీనుడు రాసిన గ్రంథ సహస్రాలను మరొక్కసారి పరిశీలించి అర్థం చేసుకోటానికి ప్రయత్నించు.'

'నీ గ్రంథాలు అర్థం చేసుకునే తెలివి చదువుల సరస్వతినైన నాకే లేదంటావా!— మూర్ఖుడా! నువ్వు చెత్త రాశావు. నాకు తీరని అపకారం చేశావు. ఇకనైనా నువ్వు రాయటం మానెయ్' సరస్వతి కోపోద్రేకంతో అంది.

'ప్రజలంతా నా గ్రంథాలను వేనోళ్ళ పొగుడుతుండగా చెత్తరాస్తున్నానని నువ్వు నన్ను నిందించటం అన్యాయము దేవీ.'

'నువ్వు కొత్త రాస్తున్నావు. ప్రజలంతా వాటిని పొగడుతున్నట్టుగా నువ్వు నీ గదిలో కలలు కంటున్నావు—నిజంగా ప్రజలు నిన్ను తిడుతున్నారు దీనివల్ల నా కతీరని అపకారం జరిగింది.'

'ప్రజలు నన్నూ నా గ్రంథాలనూ తిడుతున్నారంటే నేను నమ్మను. నీ మాట నమ్మనందుకు నన్ను క్షమించు దేవీ!' అని కవి సరస్వతి ముందు నిలవలేక ధైర్యం సంపాదించుకోటానికి తను కొత్తగా రాసిన గ్రంథం దగ్గరకు చేరుకున్నాడు. మనస్సు సంక్షోభానికి గురైనందువల్ల కవికి మతిపోయింది. కవికి మతిపోయే సమయాలు సాధారణంగా రోజూ వుంటై, దానికి విరుగుడుగా అతడు సిగరెట్టు కాలుస్తాడు. కవి యిప్పుడుకూడా ఒక సిగరెట్టు వెలిగించి గ్రంథ సమేతంగా సరస్వతివద్దకు తిరిగివచ్చాడు. సరస్వతి మాత్రం మాట్లాడకుండా వీణ వాయిస్తున్నది. కవికి సిగరెట్టు కావలసినంత ధైర్యాన్నిచ్చింది. సాక్షిగా సిగరెట్టు పొగవదుల్తూ సరస్వతితో అన్నాడు:

'దేవీ, యీ గ్రంథాన్ని ఒక్కసారి చిత్తగించు తర్వాత అది కొత్త రచనో సర్వప్రపంచ రాజ్యాంగ రచనో నీకే తెలిసిపోతుంది.'

'నీ గ్రంథం చదవవలసిన అవసరం నాకేమీ లేదు. ఇన్నాళ్లూ చెత్త రాసిన వాడివి ఇప్పుడు మాత్రం రాయవని నమ్మకమేముంది?—నిన్ను గురించి ప్రజలకువున్న అభిప్రాయం నీ కిప్పుడే తెలుస్తుంది. విను జాగ్రత్తగా' అని సరస్వతి వీణ వాయించటం ఆపేసింది.

కవి చెవులొగ్గి వింటున్నాడు. 'డౌన్ విత్ చెత్తకవి, డౌన్ డౌన్' అని అనేకమంది ఏక కంఠంతో అరవటం అతడికి దూరంనించి మెల్లగా వినపడింది. కవి నోరు తెరచుకుని ఇంటికప్పువైపు చూస్తూ వింటూ నిల్చున్నాడు. రాను రాను ఆ ధ్వని దగ్గరకు వస్తూన్నట్టుంది. మరొక్కసారి దగ్గరగా 'డౌన్ విత్ చెత్తకవి, డౌన్ డౌన్' అని అతి సమీపంగా వినపడటంతోనే కవి సరస్వతి వైపు చూశాడు. సరస్వతి వెనకగా అద్దంలో పెద్ద జనసమూహం బారులు తీర్చి నల్లజెండాలు పట్టుకుని నిలబడివుంది. కవి తన కళ్ళను తానే నమ్మలేక పోయాడు.

'ఇప్పుడు చెప్పు-నువ్వు రాసిందంతా చెత్త కాదూ!' సరస్వతి ఖంగుమని మోగింది.

పోయే ధైర్యాన్ని సిగరెట్టు పొగతో భర్తీ చేసి శాంతగంభీర స్వరంతో కవి అన్నాడు—

'కాదు-ముమ్మాటికీ కాదు'

కవి జవాబు వినగానే జన సమూహంలో కలవరం బయలుదేరింది. 'డౌన్ విత్ చెత్త కవి-డౌన్ డౌన్' 'తగలపెట్టండి చెత్త గ్రంథాలను' అంటూ జన సమూహం ముందుకు తోసుకు వస్తోంది. కవి కుడిచేతులోవున్న 'విశ్వమానవ సౌభ్రాతృత్వం' కిందపడిపోయింది.

'తగుల పెట్టండి' అని మరొక్కసారి జన సమూహం గొల్లుమంది. దాంతో అతని ఎడమ చేతిలోవున్న సిగరెట్టు కిందపడి అంతకుముందు కిందపడిన వ్రాతప్రతిమీదకు దొర్లింది. 'విశ్వమానవ సౌభ్రాతృత్వం' రాజుకోవటం మొదలుపెట్టింది.

'ఇకనైనా రాయటం మానేస్తావా?' సరస్వతి అడిగింది, అధికార స్వరంతో.

కవి మాట్లాడలేదు తగులబడుతున్న వ్రాత ప్రతివైపు శిలా ప్రతిమలాగ చూస్తున్నాడు. కవి చూస్తూండగానే అతడి 'విశ్వమానవ సౌభ్రాతృత్వం' తగులబడి బూడిదగా మారింది — జన సమూహం మాయమైంది-గది అంతా పొగతో నిండిపోయింది.

'ప్రజలు నన్ను అర్థం చేసుకోలేక పోయినందుకు నేనంతగా విచారించటం లేదు నువ్వుకూడా నన్ను అపార్థం చేసుకొంటున్నావంటే నా హృదయం రక్తబిందువుల్ని రాలుస్తున్నది. కాని, దేవీ ఒక్క విషయం గ్రహించు. నువ్వేం చేసినాసరే నిన్ను పూజిస్తాను-ఆరాధిస్తాను.' కవి కన్నీటితో అన్నాడు.

ఇంకా రాస్తావా! విజయగర్వంతో సరస్వతి అన్నది.

గంభీరంగా కవి అన్నాడు:

'రాయను. కాగితంమీద రాస్తే తగల పెడ్తారు. హృదయంలో రాసుకుంటా, హృదయాన్ని ఎవరూ తగలపెట్టలేరు!'

సరస్వతి వీణ ఒక్కసారి మీటి చిరునవ్వుతో అంతర్ధానమైంది. కవి పొగను తట్టుకోలేక మూర్ఛపోయాడు. నల్లటి విశ్వమానవ సౌభ్రాతృత్వపు బుగ్గి గాలి కెగిరి గది నలుమూలలా నృత్యం చేస్తోంది. ఆ నృత్యాన్ని నిలువుటద్దం ప్రతిబింబింప చేస్తోంది.